Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
04-02-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 39 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD బుధవారం WWW.EPAPER.MAHAADAILY.COM



### ట్రంప్ ఒత్తిడితోనే
# మోదీ ట్రేడ్ డీల్
**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు**
నాలుగునెలలుగా నిలిచిన ట్రేడ్ డీల్ పై అకస్మాత్తుగా సంతకాలు

**ఢిల్లీ:** నాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్అమెరికా ట్రేడ్ డీల్పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. 'ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది.
మిగతా 2లో

**టాప్ న్యూస్**

యుపిఐ ద్వారా
రూ. 230 లక్షల కోట్ల
## లావాదేవీలు
- ఇది ఆల్ టైమ్ రికార్డు





02

ఇన్వెస్టర్లకు
రూ.13 లక్షల కోట్ల
## లాభం
- మార్కెట్ చరిత్రలో సింగిల్ డే స్పీడ్ ర్యాలీ



02

హెలికాప్టర్ తయారీలోకి
## అదానీ గ్రూప్
- అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఇటలియన్ దిగ్గజం లియోనార్డో మంగళవారం వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని




02

## వాట్సాప్ కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్
**రాజ్యాంగ నిబంధనలు పాటించకుంటే.. దేశం విడిచి వెళ్ళండి**



**మహా:**భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది.
మిగతా 2లో

## ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ
**ఏపీ సీఎం చంద్రబాబు**



**అమరావతి, మహా :**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

# మోదీ మెగా డీల్స్




**భారత వాణిజ్యానికి ఊపు**

**అమెరికా, ఈయూ ఒప్పందాలపై ఆశ్చర్యపోతున్న ప్రపంచం**

**5 ట్రిలియన్ డాలర్ల దిశగా భారత్ పరుగులు**

**వచ్చే పదేళ్ళలో భారత్ కు 150 బిలియన్ డాలర్ల ఎగుమతుల ప్రోత్సాహం**

**మహా నెట్ వర్క్ :**
భారత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ట్రంప్ చేస్తున్న టారిఫ్ యుద్ధానికి అన్ని దేశాలు వణికిపోతున్న వేళ.. ఓ వైపు టారిఫ్ లు, మరోవైపు యుద్ధాలు, చుట్టూ మార్కెట్ లో అనిశ్చితి ముసురుకున్న వేళ ఒ కేవలం వారం రోజుల వ్యవధిలోనే అటు యూరోపియన్, యూనియన్ ఇటు అమెరికాతో భారత్ కుదుర్చుకున్న రెండు మెగా ట్రేడ్ డీల్స్ వరల్డ్ లోనే వండర్ గా మారాయి. ఔరా భారత్ అంటూ ప్రపంచమే విస్తుపోయింది. ప్రపంచం మొత్తం టారిఫ్ లతో ఇబ్బందిపడుతున్న వేళ ప్రధాని మోదీ తన చాణక్యంతో భారత్ కు బిలియన్ డాలర్ల లాభాన్ని చేకూర్చారు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడే సంయమనంతో వ్యవహరించాలి. అలా ఉంటేనే పరిస్థితులు ఎవరికైనా అనుకూలంగా మారుతాయి. భారత్ పై 100 శాతం వరకు టారిఫ్ లు వేస్తానని ట్రంప్ ప్రకటించగానే చాలా మంది వణకిపోయారు. ఇంకేముంది మన దేశం ఆర్థికంగా కుదేలైపోతుందని గగ్గోలు పెట్టారు. ట్రంప్ ను ఎదిరించలేకపోతున్నారంటూ కేంద్ర ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. కానీ సీన్ కట్ చేస్తే అటు యూరోపియన్ యూనియన్ ఇటు అమెరికాతో రెండు భారీ వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకొని మోదీ ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించింది. అగ్రరాజ్యం అమెరికా విధిస్తున్న భారీ టారిఫ్ లతో ప్రపంచ దేశాలన్నీ బెంబేలుపోతుంటే భారత్ మాత్రం తనదైన శైలిలో వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. కేవలం ఏడు రోజుల్లోనే కుదిరిన ఈ రెండు ఒప్పందాల ద్వారా రాబోయే 10 ఏళ్లలో భారత్ కు సుమారు 150 బిలియన్ డాలర్ల ఎగుమతుల ప్రోత్సాహం లభిస్తుంది. ఇది కేవలం వ్యాపారం మాత్రమే కాదు ప్రపంచ దేశాల మధ్య చిక్కుకోకుండా భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను ఎలా కాపాడుకోగలదో నిరూపించిన సందర్భంగా నిలిచింది.
మిగతా 2లో

# మంత్రులందరూ జిల్లాల్లోనే ఉండాలి
ప్రతీ స్థానం కచ్చితంగా గెలవాల్సిందే.. పార్లమెంట్ ఇన్ ఛార్జిలదే బాధ్యత
90 శాతం మునిసిపాలిటీలు గెలుస్తున్నాం.. ప్రతీదీ గెలవాలి
మంత్రులు, ఇన్ ఛార్జిలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
సమావేశానికి హాజరైన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్
సర్వే లలో వెనకబడిన మున్సిపాలిటీ లను విశ్లేషించిన సీఎం

**హైదరాబాద్, మహా:**
మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని, రోజు వారీగా రిపోర్ట్ తనకు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను, పార్లమెంట్ ఇన్ ఛార్జిలను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల వేళ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మంత్రులతో, పార్లమెంట్ ఇన్ ఛార్జిలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. సర్వే లలో వెనకబడిన మున్సిపాలిటీ లను సీఎం విశ్లేషించారు. మంత్రులు అందరూ జిల్లాలకు వెళ్ళి, వెనుకబడిన మున్సిపాలిటీలను విశ్లేషించాలని అన్నారు. రోజువారీ రిపోర్ట్ తనకు అందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలను బుజ్జగించాలని అన్నారు. అందరూ సమిష్టిగా పనిచేయాలని.. ఒక్క ఓటు కూడా చీలకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కచ్చితంగా అన్ని స్థానాలు గెలవాల్సిందేనన్నారు. పాత, కొత్త నేతలు అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జులదే గెలుపు బాధ్యత అని అన్నారు. ఒక్కటి మిస్సవ్వకుండా అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని చెప్పారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ తమ ఇంచార్జి



మిగతా 2లో

## బుల్లెట్ రైల్ హబ్‌గా
# తెలంగాణ
**కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు భారీ నిధులు**

- 'హబ్స్ ఆఫ్ హబ్ గా హైద్రాబాద్'
- త్వరలోనే హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ మూడో ఫేజ్
- ప్రధాని మోదీ చేతులమీదుగా భూమి పూజ
- రూ.42 వేల కోట్ల నిధులతో కొత్తగా జాతీయ రహదారుల నిర్మాణం
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్ర బడ్జెట్ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల కోసం కాకుండా 'వికసిత్ భారత్' కోసం రూపొందించిన బడ్జెట్ ఇది అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన కిషన్ రెడ్డి రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ లో నిధులేమీ లేవంటూ మంత్రులు, విపక్షంలోని కొంత మంది నేతలు చేస్తున్న ప్రకటనలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.
మిగతా 2లో

## మునిసిపల్ ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి

- ఎన్నికలు పూర్తయ్యేవరకు అక్కడే మకాం వేయాలి
- ఇన్ ఛార్జిలు, కో-ఆర్డినేటర్లతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని సూచించారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మున్సిపల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని, ఇచ్చిన హామీల అమలులో విఫలమై మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.
మిగతా 2లో



## మణిపూర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్

**మహా:**మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ ఎంపికయ్యారు. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో బీజేపీ కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ సంబిత్ పాత్రా తదితరుల సమక్షంలో వై.ఖేమ్‌చంద్ సింగ్ ను బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీనితో ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో ఆయన నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది.

**ఉపముఖ్యమంత్రిగా కుకీ మహిళా నేత**
మణిపూర్ కొత్త ప్రభుత్వంలో కుకీ మహిళా నాయకురాలు నెమ్చా కిప్గెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీజేపీ ఇక్కడ చాలా వ్యూహాత్మకంగా ఒక మైతీ తెగ నుంచి సీఎంను, కుకీ తెగ నుంచి డిప్యూటీ సీఎంను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇది కుకీ వర్గంలో ఉన్న అసంతృప్తిని తగ్గించే ప్రయత్నంగా విశ్లేషిస్తున్నారు.

## ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని ప్రియుడిని చంపిన ప్రియురాలు




**మహా :** కేవలం ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడనే కోపంతో, ఓ యువతి కత్తితో తన ప్రియుడిని పొడిచింది. దీనితో ఆ యువకుడు అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. "కమ్తా ప్రసాద్ సూర్యవంశీ అనే 25 ఏళ్ల యువకుడు 'శుభమ్ విహార్ టీచర్స్ కాలనీ'లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతను స్థానిక హోటల్‌లో పనిచేస్తున్నాడు. నిందితురాలికి అతనికి మధ్య గత కొంత కాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది.
మిగతా 2లో

## పాతబస్తీలో విషాదం
- ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ కన్నుమూత
- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత



02


## కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు
అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని ఆదేశాలు
నేటి ఉదయం గం. 11 లకు హాజరు కావాలని ఆదేశం



**హైదరాబాద్:** రాష్ట్ర రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు.
మిగతా 2లో

## ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని ప్రియుడిని చంపిన ప్రియురాలు

(మొదటిపేజీ తరువాయి)



వీరిద్దరికీ సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. దీనితో ఒకరింటికి మరొకరు వచ్చి, వెళ్తుండేవారు. అయితే ఇటీవలి కాలంలో వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీనితో కమ్తా ప్రసాద్ ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. దీనితో నిందితురాలు కమ్తా ప్రసాద్ అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లింది. తనతోపాటు ఓ కత్తిని తీసుకెళ్లింది. కానీ అది అతనికి కనబడకుండా దాచింది. తరువాత తన ఫోన్ నంబర్ ఎందుకు బ్లాక్ చేశావని ప్రియుడిని నిలదీసింది. అంతేకాదు అతని మొబైల్‌లోని చాటింగ్స్‌ను చూపించాలని పట్టుబట్టింది. అయితే కమ్తా ప్రసాద్ ఫోన్ ఇవ్వడానికి, ఆమెకు తన చాటింగ్స్ చూపించడానికి నిరాకరించాడు. దీనితో మాటామాటా పెరిగింది. చివరికి ఆమె ఆగ్రహంతో తన వద్ద ఉన్న కత్తితో అతనిపై విచక్షణారహితంగా దాడి చేసింది. తీవ్రగాయాలతో కమ్తా ప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. ఈ సమాచారం అందగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు తీవ్రతను బట్టి మేము తక్షణమే దర్యాప్తు ప్రారంభించాం. కేవలం ఫోన్ నంబర్ బ్లాక్ చేయడం వల్లనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది" అని బిలాస్‌పూర్ ఎస్ఎస్‌పీ రజనీశ్ సింగ్ తెలిపారు.

# పాతబస్తీలో విషాదం

**ఎంఐఎం మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ కన్నుమూత**

**అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**



**హైదరాబాద్, మహా :** ఏఐఎంఐఎం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ మంగళవారం కన్నుమూశారు. గత రెండు సంవత్సరాలుగా మూత్రపిండ సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సాయంత్రం మరణించారు. అనారోగ్య సమస్యతో గతేడాది నవంబర్ చివరి వారంలో ఆసుపత్రిలో చేరగా పరిస్థితి విషమించి చివరికి తుదిశ్వాస విడిచారు. పాషా ఖాద్రీ ఎంఐఎంలో కీలక స్థానాన్ని దక్కించుకున్న నేత. 2004లో చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా మూడు సార్లు అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2018లో యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి గెలిచి 2023 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. పాషా ఖాద్రీ ఎంఐఎం వ్యవస్థాపకుడు సుల్తాన్ సలాహుద్దీన్ ఓవైసీకి అత్యంత సన్నిహితుడిగా, విశ్వసనీయ సహచరుడిగా గుర్తింపు పొందారు. 2008లో ఎంఐఎం జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన పాషా ఖాద్రీ, పార్టీని బలోపేతం చేయడంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లోని ముస్లిం ఓటర్లలో ఎంఐఎం స్థిరమైన ఆధిపత్యాన్ని కొనసాగించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన వ్యూహాత్మక నిర్ణయాలు, పార్టీ విస్తరణలో చేసిన కృషి ఎంఐఎంకు బలమైన పునాది వేశాయి. సుమారు 60 ఏళ్ల వయసులో ఖాద్రీ మరణం ఎంఐఎంకు పెద్ద లోటు. చార్మినార్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో ఆయనకు ఉన్న బలమైన పట్టు, ప్రజలతో ఉన్న అనుబంధం పార్టీకి అమూల్యమైందని ఎంఐఎం వర్గాలు తెలిపాయి. పార్టీలో ఆయన స్థానాన్ని భర్తీ చేయడం కష్టమని సహచర నేతలు చెబుతున్నారు.

## హెలికాప్టర్ తయారీలోకి అదానీ గ్రూప్




**మహా:** అదానీ గ్రూప్ దేశంలో కొత్తగా హెలికాప్టర్ల తయారీలోకి అడుగుపెడుతోంది. దేశంలో ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఇటాలియన్ దిగ్గజం లియోనార్డో మంగళవారం వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్టు వెల్లడించాయి. ఈ మేరకు ఇరు సంస్థలు మంగళవారం భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇటీవలే అదానీ గ్రూప్ విమానాల తయారీ కోసం బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రేయర్ కంపెనీతో జత కట్టింది. . దేశవ్యాప్తంగా 250 కంటే తక్కువ హెలికాప్టర్లు ఉండటంతో ఈ రంగంలో వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సీఈఓ ఆశీష్ రాజ్‌వంశీ చెప్పారు. రాబోయే పదేళ్లలో ఏడాదికి 100 హెలికాప్టర్ల అవసరం ఉంటుందని ఆయన అంచనా వేశారు.

# మోదీ మెగా డీల్స్

(మొదటిపేజీ తరువాయి)

మన ఫార్మా, స్టీల్, టెక్స్టైల్ రంగాలకు ఊపిరి పోస్తూ.. చైనా, వియత్నాం వంటి దేశాలకు చెక్ పెడుతూ భారత్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయాల వెనుక మోదీ వ్యూహాత్మకత ఉంది. అమెరికాతో కుదిరిన ఒప్పందం భారత ఎగుమతిదారులకు ఒక తీపికబురు. గతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు గాను ట్రంప్ ప్రభుత్వం భారత్ పై 25% పెనాల్టీతో కలిపి మొత్తం 50% భారీ టారిఫ్ ను విధించింది. దీనివల్ల మన ఉక్కు, టెక్స్టైల్స్ ఫార్మా రంగాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. కానీ ప్రధాని మోదీ తన వ్యక్తిగత చొరవతో ట్రంప్ తో ఉన్న సత్సంబంధాలను ఉపయోగించి ఈ పెనాల్టీని పూర్తిగా ఎత్తివేసేలా చేశారు. ఇప్పుడు భారత వస్తువులపై టారిఫ్ కేవలం 18%. దీనివల్ల కలిగే లాభాలు అక్షరాల కోట్లలోనే. స్టీల్ రంగాన్ని చూసుకుంటే అమెరికాకు ఎగుమతులు 40% పడిపోయిన సందర్భంలో ఈ ఒప్పందంతో కనీసం 2 బిలియన్ డాలర్ల ఆదాయం తిరిగి వచ్చే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద జనరిక్ ఔషధాల ఎగుమతిదారు అయిన భారత్ కు ఈ ట్రేడ్ డీల్ పెద్ద వరం. 26% ఉన్న టారిఫ్ తగ్గడం వల్ల సుమారు 10 బిలియన్ డాలర్ల అదనపు యుగమతులు ఫార్మా రంగం ద్వారా సాధ్యమవుతాయి. ఇక 60% సుంకాలతో కుదేలైన సముద్ర ఉత్పత్తుల రంగం కూడా ఈ ఒప్పందంతో తిరిగి ఊపిరి పోసుకోబోతుంది. ఇదంతా మోదీ ప్రభుత్వం అనుసరించిన నేషన్ ఫస్ట్ పాలసీ వల్లనే సాధ్యమైంది.

**యూరోపియన్ యూనియన్ ఒప్పందమూ వరమే**

యూరోపియన్ యూనియన్ తో కుదిరిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్. పెద్ద విజయం. సుమారు రెండు దశాబ్దాలుగా నలుగుతున్న ఈ చర్చలను మోదీ ప్రభుత్వం ఒక కొలిక్కి తెచ్చింది. భారత్ తన 77వ గణతంత్ర వేడుకలు జరుపుకుంటున్న మరుసటి రోజే ఈ ఒప్పందంపై సంతకాలు జరగడం విశేషం. ఈ ఒప్పందంలోని ప్రధాన అంశం ఏంటంటే.. జీరో టాక్స్. అవును భారత్ నుంచి యూరోప్ కు వెళ్ళే 99.5% వస్తువులపై బ్రెసల్స్ 0% పన్ను విధించనుంది. ముఖ్యంగా లెదర్ వస్తువులు, జ్యువలరీ రంగానికి ఇది అపారమైన అవకాశాలను కల్పిస్తుంది. దీనివల్ల 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 272 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచన. భారత్ కూడా యూరోపియన్ కార్లపై ఉన్న 110% టారిఫ్ ను ఐదేళ్లలో 10%నికి తగ్గించేలా అంగీకరించింది. దీనివల్ల భారత వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి రావడమే కాకుండా విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతాయి. అంతేకాకుండా గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించడానికి యూరోపియన్ యూనియన్ భారత్ కు 500 మిలియన్ యూరోల ఆర్థిక సాయం కూడా ప్రకటించింది. ఈ రెండు ఒప్పందాలు భారత్ ను ప్రపంచ వాణిజ్య పటంపై అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఒకవైపు అమెరికా చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుంటే భారత్ మాత్రం ఇరువైపులా ప్రయోజనం పొందేలా వ్యూహం రచించింది. బంగ్లాదేశ్ వియత్నాం వంటి దేశాల నుంచి వస్తున్న పోటీని తట్టుకునేలా మన టెక్స్టైల్ రంగానికి ఈ ఒప్పందాలు ఊపిరిపోయినున్నాయి. వారం రోజుల్లో కుదిరిన ఈ రెండు మెగా డీల్స్ భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ల దిశగా పరుగులు తీయించబోతున్నాయి.. రాబోయే రోజుల్లో మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులు అమెరికా యూరోప్ విధుల్లో మరింత ఎక్కువగా కనిపించబోతున్నాయి. మోదీ వ్యూహాత్మకత, ప్రపంచ మార్కెట్ అంతా అతలాకుతలమవుతున్న పరిస్థితుల్లో భారత్ ను ధీటీగా నిలబెట్టింది.

## మునిసిపల్ ఎన్నికల్లో గులాబీజెండా ఎగరాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణం నెలకొందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న వారం రోజులపాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడంపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మున్సిపల్ కోఆర్డినేటర్లు తమకు కేటాయించిన క్షేత్రాల్లోనే అందుబాటులో ఉండాలని సూచించారు.

## ఇన్వెస్టర్లకు రూ.13 లక్షల కోట్ల లాభం

**మార్కెట్ చరిత్రలో సింగిల్ డే స్పీడ్ ర్యాలీ**

**మహా:** స్టాక్ మార్కెట్ మంగళవారం లాభాల పంట పండించింది. కొన్ని నెలల నుంచి స్తబ్దుగా ఉన్న మార్కెట్లలో మంగళవారం ఒక్కసారిగా రికార్డు ర్యాలీ కనిపించింది. సోమవారం రాత్రి ఆలస్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత ఇవ్వడంతో మదుపర్ల సెంటిమెంట్ పుంజుకుంది. 2025, మే 12 తర్వాత అంటే దాదాపు ఎనిమిది నెలల్లో ఇదే అతిపెద్ద సింగిల్‌డే ర్యాలీ అని విశ్లేషకులు తెలిపారు. ఈ భారీ లాభాలతో మంగళవారం ఒక్కరోజే మదుపర్ల సంపద రూ. 12.75 లక్షల కోట్లు పెరిగింది. ఫలితంగా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 467.10 లక్షల కోట్లకు చేరుకుంది. మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 2072.67 పాయింట్లు పుంజుకుని 83,739కి చేరింది. నిఫ్టీ 639.15 పాయింట్లు లాభపడి 25,727 వద్దకు చేరింది. భారత రూపాయి బలమైన ఆసియా కరెన్సీగా మారింది. ఒక్కరోజులోనే 122 పైసలు పెరిగి అమెరికా డాలర్‌తో పోలిస్తే రూ. 90.27 వద్ద ఉంది.

## మంత్రులందరూ జిల్లాల్లోనే ఉండాలి



(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల్లోనే ఉండి మానిటరింగ్ చేయాలని, ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్, వార్‌రూమ్ దృష్టికి తీసుకురావాలన్నారు.

**ఎవరితో పొత్తులేదు**

మునిసిపల్ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులేదని, ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతి మునిసిపాలిటీ కి, కార్పొరేషన్ కు పీసీసీ పరిశీలకులను నియమించనున్నామన్నారు. రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలు లేని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్ లకు టీపీసీసీ బాధ్యతలు ఇవ్వనున్నది.

**నేటి నుండి సీఎం రేవంత్ ప్రచారం**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటనలు చేపట్టనున్నారు. పలు జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రచార సభల్లో సీఎం పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా సీఎం పర్యటనలు, సభల్లో పాల్గొననున్నారు. దీనిలో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో, 5న కరీంనగర్ జిల్లా చొప్పదండిలో, 6న నిజామాబాద్ జిల్లాలో, 7న రంగారెడ్డి జిల్లాలోని పరిగిలో, 8న వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలో, 9న మెదక్‌లో ఎన్నికల సభల్లో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

## కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు

**అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని ఆదేశాలు**

**నేటి ఉదయం గం. 11 లకు హాజరు కావాలని ఆదేశం**

(మొదటిపేజీ తరువాయి)



పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అనర్హత వేటుపై బీఆర్ఎస్ పట్టు**

ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. నేటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

**సంచలనంగా మారిన దానం నాగేందర్ అఫిడవిట్..**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని స్పీకర్ ముందు జరిగిన వాదనలలో నాగేందర్ వాదించారు. గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని పేర్కొన్నారు. చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ఈ ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్**

అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణమోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్‌గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

## యుపిఐ ద్వారా రూ. 230 లక్షల కోట్ల లావాదేవీలు

**ఇది ఆల్ టైమ్ రికార్డు**

**ఢిల్లీ, మహా:** దేశంలో డిజిటల్ చెల్లింపులు అత్యంత వేగంగా ఊహించని స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ వరకు యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలు రికార్డు స్థాయిలో రూ. 230 లక్షల కోట్లకు చేరాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఓ ప్రశ్నకు సమాధానమిచ్చిన ఆయన.. యూపీఐ ఆధారిత లావాదేవీల విలువ చాలా వేగంగా విస్తరిస్తున్నాయి. దేశీయ లావాదేవీల విషయానికొస్తే, 2025 26 సంవత్సరంలో డిసెంబర్ వరకు మొత్తం రూ. 230 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఇది 202223లో జరిగిన మొత్తం రూ. 139 లక్షల కోట్ల లావాదేవీల విలువతో పోలిస్తే చాలా ఎక్కువని అన్నారు.

## వాట్సాప్ కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు.

# బుల్లెట్ రైల్ హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ సమగ్ర స్వరూపం పరిశీలించి నిధుల కేటాయింపును పూర్తిగా ఆకళింపు చేసుకున్న తర్వాత బాధ్యత కలిగిన నేతలు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ మూడో దశ పనులకు త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ చేస్తారని కిషన్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటి వరకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని పేర్కొన్నారు. అదేవిధంగా జాతీయ రహదారుల నిర్మాణంలో తెలంగాణకు పెద్దపీట వేశామని తెలిపారు. కొమురవెల్లి, జోగులాంబ రైల్వే స్టేషన్లను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 5 వందే భారత్, 2 అమృత్ భారత్ రైళ్లను తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. రూ.5.50 లక్షల కోట్లతో 3 హై స్పీడ్ రైల్ కారిడార్లు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. మేడారం జాతరకు కేంద్రం ప్రకటించిన నిధులను రాష్ట్రానికి తీసుకొచ్చే బాధ్యత తనదేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా నరేంద్రమోదీ హయాంలోని ప్రభుత్వం ప్రజలకు చెప్పే వాటినే చేస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఈసారి బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఉందన్నారు. 2047 నాటికి వికసిత భారత్ ను తీర్చిదిద్దే లక్ష్యంలో ఈ బడ్జెట్ మరొక ముందడుగు అని చెప్పొచ్చన్నారు. యువతకు, గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు, పరిశోధనలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు.

**సుస్థిర అభివృద్ధికి రెక్కలు - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

దేశంలో సుస్థిరమైన అభివృద్ధి కావాలనే ఆకాంక్షకు రెక్కలు తొడిగే బడ్జెట్ ఇది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక పరిశోధకులు, మేధావులు, అవగాహన కలిగిన వారి మన్ననలు పొందిన బడ్జెట్ను నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్రాల వారీగా కాకుండా, దేశ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ను రూపొందించడం జరిగిందన్నారు. ఐటీ హబ్, ఎడ్యుకేషనల్ హబ్, డిజిటల్ హబ్, హైస్పీడ్ రైల్ కారిడార్ హబ్, సెమీ కండక్టర్ హబ్, డేటా సెంటర్ హబ్, మెడికల్ హబ్, ఇలా హైదరాబాద్.. 'హబ్స్ ఆఫ్ హబ్ హైద్రాబాద్' ట్రిబుల్ హెచ్ గా అవతరించిందన్నారు. తెలంగాణలో ఉన్న 23 లక్షల ఎంఎస్ఎంఈలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందని, వచ్చే ఐదేళ్ల కోసం రూ.10వేల కోట్లతో ప్రకటించిన బయోఫార్మా శక్తి (స్ట్రాటజీ ఫర్ హెల్త్ కేర్ అడ్వాన్స్‌మెంట్ త్రూ నాలెడ్జ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్) కార్యక్రమం ద్వారా ఫార్మా కేపిటల్ గా ఉన్న మన హైదరాబాద్ నగరానికి చాలా మేలు జరగనుందని వివరించారు. ఈ పథకం కింద దేశంలో 3 కొత్త నిపర్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసర్చ్) సంస్థలను ఏర్పాటు చేయనున్నారన్నారు. వికసిత్ భారత్ రూరల్ అజీవికా మిషన్ గ్రామీణ్ కి సంబంధించిన నిధులు కూడా పెరగనున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దీనిపై లేనిపోని ఆరోపణలు చేసిందని, ఇందుకు భిన్నంగా 202526లో రూ.88వేల కోట్లు ఉన్న ఉపాధి హామీ పథకం బడ్జెట్.. 202627 సంవత్సరానికి రూ.96 వేల కోట్లకు పెరిగిందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతికూల పరిస్థితులతో సంబంధం లేకుండా ఎరువులను రైతులకు భారీ సబ్సిడీ అందజేస్తున్నామని, టెక్స్ఇకో కార్యక్రమం ద్వారా.. టెక్స్‌టైల్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీకి తగ్గట్లుగా భారతీయ వస్త్ర పరిశ్రమ ఎదిగేందుకు కేంద్రం సహకరించనుందన్నారు. ఇప్పటికే తెలంగాణకు ప్రకటించిన 'కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్'కు ఈ పథకం ద్వారా మరింత లబ్ధి చేకూరనుందని మంత్రి ప్రకటించారు.

**తెలంగాణకు వచ్చేవి ఇవే**

- ప్రతి జిల్లాకు ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ద్వారా తెలంగాణలోని 33 జిల్లాలకు ఒక్కో గర్ల్స్ హాస్టల్ రానుందని తెలిపారు.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజనఅర్బన్ కింద తెలంగాణకు 1.3 లక్షల ఇళ్లకు ఇంటికి రూ. లక్షన్నర చొప్పున రూ.2,190 కోట్లు కేటాయించనుందని, ప్రధానమంత్రి అవాస్ యోజనరూరల్ లో భాగంగా తెలంగాణకు ఇంటికి.. రూ.72 వేల చొప్పున 3 లక్షల ఇళ్ల కోసం రూ.2,160 కోట్లు కేటాయించనుందన్నారు.
- హైదరాబాద్‌లో అటామిక్ మినరల్స్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ కు రూ.406 కోట్లు, ఏఆర్ సీఐ (ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్), సీడీఎఫ్ డీ (సెంటర్ ఫర్ DNA ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయోటెక్నాలజీ లాంటి కేంద్ర సంస్థలకు సుమారు రూ.3 వేల కోట్లు కేటయించారన్నారు.
- తెలంగాణలో దాదాపు 5 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేశామని, రూ.2,471.76 కోట్ల వ్యయంతో 64 కిలోమీటర్ల పొడవున ఆర్మూర్ జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం జరగనుందన్నారు.
- రూ.2,484 కోట్ల అంచనా వ్యయంతో 59 కిలోమీటర్ల మేర జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారి నిర్మించనున్నారన్నారు.
- రూ.2,730 కోట్ల ఖర్చుతో 68 కిలోమీటర్ల పొడవున 4 లేన్లతో ఆర్మూరు జగిత్యాల మంచిర్యాల జాతీయ రహదారి నిర్మాణం జరగనుందని తెలిపారు.
- రూ.3,175 కోట్ల వ్యయంతో మహబూబ్‌నగర్-గూడెబల్లూరు మధ్య 80 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ చేపట్టనున్నారని, 231 కిలోమీటర్ల మేర ఆరు లేన్లతో హైదరాబాద్విజయవాడ మధ్య రూ.10,297 కోట్లతో రహదారి నిర్మించనున్నారన్నారు.
- రీజనల్ రింగ్ రోడ్డు (ఉత్తర భాగం)కు రూ.21,629 కోట్లను కేంద్రం కేటాయించిందని, మొత్తం తెలంగాణలో రూ.42 వేల కోట్ల నిధులతో కొత్తగా జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

**రైల్వే ప్రాజెక్టులకు పెద్ద పీట**

- రైల్వేకు సంబంధించి దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా హైదరాబాద్ కు ప్రాజెక్టులు కేటాయించడం జరిగిందని, 20092014 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల కోసం అప్పటి ప్రభుత్వం రూ.886 కోట్లు కేటాయిస్తే తాజా బడ్జెట్‌లో ఏకంగా 6 రెట్లు అధికంగా రూ.5,454 కోట్లు కేటాయించామన్నారు.
- ప్రస్తుతం రాష్ట్రంలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే ట్రాక్ ల నిర్మాణం, రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని, అమృత్ భారత్ పథకం ద్వారా 42 రైల్వే స్టేషన్లను పునరుద్ధరిస్తున్నారన్నారు.
- ఇప్పటికే 5 స్టేషన్లు పూర్తి అయ్యాయని, అందులో బేగంపేట, కరీంనగర్, వరంగల్, చర్లపల్లి స్టేషన్ల ఆధునీకరణ పూర్తయిందన్నారు. త్వరలోనే కొమురవెల్లి మల్లన్న, జోగులాంబ రైల్వే స్టేషన్లు కూడా పూర్తికానున్నాయని, 2026లో 30 కి పైగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి అవుతాయని తెలిపారు.
- తెలంగాణకు ఇప్పటికే 5 వందే భారత్ రైళ్లు, 2 అమృత్ భారత్ రైళ్లు కేటాయించారని, 2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో 900 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణం పూర్తయితే 2014 నుంచి ఇప్పటివరకు 1,115 కిలోమీటర్ల మేర రైల్వే ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తయ్యాయని వివరించారు. దీంతో తెలంగాణలోని రైల్వే ట్రాక్‌లకు 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ సాధ్యమైందన్నారు.
- తెలంగాణలో మొత్తం 1242 కిలోమీటర్ల మేర రైల్వే లైన్లలో కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు మంజూరు కాగా, ఇప్పటి వరకు 627 కిలోమీటర్ల మేర పూర్తి అయింది. 410 కిలోమీటర్ల మేర పనులు త్వరలోనే పూర్తికానున్నాయి. దేశంలో 7 హైస్పీడ్ రైల్ ఎలివేటెడ్ కారిడార్స్ ప్రకటిస్తే.. అందులో మూడు మన హైదరాబాద్ నగరం నుంచే ప్రారంభం అవుతున్నాయని, అవి హైదరాబాద్పుణే, హైదరాబాద్బెంగళూరు, హైదరాబాద్చెన్నై అని వివరించారు. ఈ కారిడార్లతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కేవలం 2 గంటల్లో చేరుకోవచ్చు. ఇందుకోసం రూ.లక్షా 51వేల కోట్లను కేంద్రం ఖర్చుచేయనుందన్నారు.
- హైదరాబాద్ నుంచి చెన్నై వరకు కేవలం 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని, ఇందుకోసం రూ. లక్షా 90వేల కోట్లను కేంద్రం ఖర్చుచేయనుందన్నారు.
- హైదరాబాద్ నుంచి పుణే వరకు కేవలం గంటా 55 నిమిషాల్లో చేరుకోవచ్చన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తమిళనాడుకు తెలంగాణకు కనెక్టివిటీ మరింతగా పెరుగుతుందని తెలిపారు.

**నిలకడగా అభివృద్ధి**

కరోనా తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఒడిదొడుకులు ఉన్నాభారత్ మాత్రం నరేంద్ర మోదీ నేతృత్వంలో నిలకడగా అభివృద్ధి చెందుతోందని, అనేక దేశాలకు మన దేశ ఆర్థిక స్థితి పట్ల నమ్మకం కుదిరి.. పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, తద్వారా హైదరాబాద్ లబ్ధి పొందుతుందని పేర్కొన్నారు. 200627 బడ్జెట్ ను దీర్ఘకాలికంగా దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా రూపొందించామని, అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం సమదృష్టితో చూస్తూ నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. మేడారానికి 3 కోట్లకు పైగా నిధులను కేంద్రప్రభుత్వం కేటాయించింది. గతంలో 20 లక్షలు కూడా ఉండకపోయేదన్నారు.

## ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయకపోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. లోక్‌సభలో తనను మాట్లాడకుండా నిరోధించడం సభ సంప్రదాయాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం నాడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై మాట్లాడకుండా అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వక ప్రయత్నం జరిగిందని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. అందుకే సభలో తీవ్రమైన ఆందోళనకు దారి తీసిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంలో జాతీయ భద్రత ఒక కీలక భాగమని అన్నారు. దీనిపై పార్లమెంటులో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

03

బుధవారం, తిరుపతి | 04-02-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

## కన్న కొడుకులే తల్లిదండ్రుల పాలిట
# యమ భటులయ్యారా?

**భూమి కోసం తల్లిదండ్రుల పై దాడులు .. చావు బ్రతుకుల మధ్య వృద్ధ దంపతుల అరణ్యరోదన.. ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు**

**వరంగల్, మహా;** ఆస్తుల వల్ల సొంత వారే పరాయి వారై అయిపోతున్నారు. తల్లిదండ్రులు తమ కష్టార్జితంతో కష్టపడి సంపాదించి పెట్టి తమ పిల్లలు వృద్ధాప్యంలో తమను చూసు కుంటురానే ఆశలు అడియాశలుగానే మిగులుతున్నాయి. ఆస్తుల వల్ల తమ పిల్లలే యమ భటులుగా మారుతున్న కాలం ఇది. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో చోటు చేసుకున్న ఓ ఘటన మానవత్వాన్నే ప్రశ్నించే స్థాయికి దిగజారింది. కన్న కొడుకులే తల్లి తండ్రులను ముసలివారు అంటూ పక్కన పెట్టి, వారి భూమిని ఆక్రమించడమే కాకుండా, చివరికి ప్రాణాలకే ముప్పు తెచ్చే స్థితికి దిగజారిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. గీసుగొండ మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన తిప్పని సమ్మయ్య అనే వృద్ధుడు తన భార్యతో కలిసి జీవనం సాగిస్తున్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 270/D/1/A (10 గుంటలు), 270/D/2 (1.20 గుంటలు) కలిపి మొత్తం భూమిని తమ కుమారుడైన తిప్పని సదానందం అక్రమంగా పట్టా చేసుకున్నాడని వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా పొందిన పట్టాను వెంటనే రద్దు చేసి, తమ పేరు పై తిరిగి పట్టా చేయాలని అధికారులను



కోరుతున్నా, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, వృద్ధ దంపతులు నివసిస్తున్న ఇల్లు సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించబడినదని, ఆ ఇంటిలోనే నిరంతరం నివసిస్తూ ఇంటి పన్నులు చెల్లిస్తూ, విద్యుత్ కనెక్షన్ కూడా తమ పేరు పైనే ఉన్నప్పటికీ, కుమారుడైన తిప్పని సదానందం ఇంటిని కూడా కూలగొట్టినట్లు వారు తెలిపారు. దీంతో వృద్ధ దంపతులు నేడు నిరాశ్రయులుగా మారి, పలు గ్రామాలు తిరుగుతూ జీవనం గడపాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమకు తక్షణమే నివాస ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. ఇక గతంలో కుమారుడే తనపై దాడి చేయడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడి, కుడి చెయ్యి విరగడంతో పాటు మెదడులో రక్తం గడ్డ కట్టిందని వైద్యులు నిర్ధారించినట్టు బాధితుడు వెల్లడించారు. ఈ ఘటనపై వరంగల్ జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, గీసుగొండ పోలీస్ స్టేషన్‌లకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వృద్ధ దంపతులు ఆరోపిస్తున్నారు.

**మేం చనిపోయిన తర్వాతే నా భూమి విషయం పై విచారణ జరిగేది?**

వృద్ధులకు చట్టాలు లేవా? లేక ఉన్నా పనిచేయవా? అంటూ అధికారుల తీరు పై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూమి కోసం తల్లిదండ్రులనే శత్రువులుగా చూస్తున్న కుమారుల పై చర్యలు, వృద్ధుల రక్షణ విషయంలో ప్రభుత్వ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.ఈ ఘటనపై తక్షణమే అధికారులు స్పందించి వృద్ధ దంపతులకు న్యాయం చేస్తారా? లేక కుమారుల దౌర్జన్యానికి వృద్ధులు బలైపోతారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు గీసుగొండ మండలాన్ని దాటి, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## ప్రభుత్వ ఆసుపత్రిలో 'సూపరింటెండెంట్' మార్క్ పాలన..

- **గాడిలో పడుతున్న వైద్య సేవలు నిరుపయోగంగ వున్న సామాన్లకు పునర్జీవం..**
- **అక్రమాలకు అడ్డుకట్ట రోగులకు చేరువగా ఇంచార్జ్ సూపరింటెండెంట్ జి.ఎన్.రావు నేత..**

**నల్లగొండ మహా :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి (GGH) రూపురేఖలు మారుతున్నాయి గతంలో అవినీతి ఆరోపణలు అస్తవ్యస్త పాలనతో కునారిల్లిన ఆసుపత్రి.. ఇంచార్జ్ సూపరింటెండెంట్ జి.ఎన్. రావు నేత పగ్గాలు చేపట్టిన తర్వాత క్రమంగా గాడిలో పడుతోంది. రోగులకు మెరుగైన వైద్యం అందించడమే కాకుండా ఆసుపత్రి వనరులను సద్వినియోగం చేయడంలో ఆయన తనదైన ముద్ర వేస్తున్నారు.

**వృథాగా ఉన్న సామాన్లకు 'రిపేర్లు'**

గత ఏడాది కాలంగా ఆసుపత్రి ఆవరణలో ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పడుతున్న ఇనుప



మంచాలు, కుర్చీలు, టేబుళ్లు, స్టాండ్లు, తలుపులను చూసి ఆయన చలించిపోయారు. వాటిని తుక్కు (స్క్రాప్) కింద విక్రయించకుండా స్వయంగా దగ్గరుండి మరమ్మతులు చేయిస్తున్నారు. రిపేర్ల అనంతరం వాటిని తిరిగి వార్డుల్లో వాడుకలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టారు. దీనివల్ల ప్రభుత్వ ధనం వృథా కాకుండా ఆసుపత్రి ఆస్తులను కాపాడినట్లయిందని రోగుల బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమార్కులకు అడ్డుకట్ట..**

గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ అరుణకు మారి హయాంలో ఆసుపత్రి పాలన అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆసుపత్రిలోని పాత సామాన్లను స్క్రాప్ పేరుతో అమ్ముకుని సొమ్ము చేసుకోవాలని చూసిన అక్రమార్కులకు ఆమె కొమ్ము కాసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, ప్రస్తుత సూపరింటెండెంట్ జి.ఎన్. రావు అటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన పాలనను అందిస్తున్నారు.కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, అత్యవసర విభాగంలోకి వచ్చే రోగుల పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. క్లిష్టమైన కేసుల సమయంలో స్వయంగా అక్కడే ఉండి, జూనియర్ డాక్టర్లకు సలహాలు, సూచనలు ఇస్తూ వైద్యం అందేలా చూస్తున్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందడమే మా ప్రాధాన్యత. ఆసుపత్రిలో ఉన్న ప్రతి వస్తువు ప్రజల సొత్తు, వాటిని కాపాడుకుంటూ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తాం.

## మరిచిపోయిన బ్యాగు చోరీ.. కేసును ఛేదించిన పోలీసులు

- **నిందితుల నుంచి 3 తులాల బంగారం, నగదు, స్మార్ట్ ఫోన్ స్వాధీనం**
- **పోలీసులను అభినందించిన ఏఎస్పీ శుభమ్**

**వరంగల్ మహా;** వరంగల్ నగరం లో మరిచిపోయిన హ్యాండ్ బ్యాగును చోరీ చేసిన కేసును ఎట్టకేలకు ఇంతజార్గంజ్ పోలీసులు ఛేదించారు.వివరాల్లోకెళ్తే.. కొత్తగూడెం నివాసి శ్వేత భర్త ప్రవీణ్ కుమార్ 2601 2026 తెల్లవారుజామున వేములవాడకు వెళ్లేందుకు వరంగల్ వెంకట్రామ జంక్షన్ వద్ద బస్సు ఎక్కే ఆత్రుతలో టీవీఎస్ షోరూం ముందు హ్యాండ్ బ్యాగు మరిచిపోయింది. ఆ బ్యాగులో మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.30,000 నగదు తో పాటు ఒక వివో స్మార్ట్ ఫోన్ ఉన్నాయి.టీవీఎస్ షోరూం ఉద్యోగి పల్లకొండ వేణు ఆ బ్యాగును దొంగిలించలనే ఉద్దేశంతో, తన భార్య కళ్యాణి, తల్లి సరోజన ను ముఖానికి మాస్కులు కట్టుకొని వచ్చి బాధితురాలు మరిచిపోయిన బ్యాగు వారిదే అని వాచ్మెన్ కేదారి ని నమ్మించి మోసపూరితంగా ఆ బ్యాగ్ ను తీసుకెళ్లారు. ఈ క్రమంలో బాధితురాలు శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు Cr.No. 34/2026 లో కేసు నమోదు చేసిన




ఇంత జార్గంజ్ పోలీసులు సీసీ కెమెరాలు, ఐటీ కోర్ సాంకేతిక ఆధారాల సహాయంతో క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం వాహనాల తనిఖీ సమయంలో నిందితులు వేణు, కళ్యాణిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి బ్యాగులో నుండి వారు దొంగిలించిన మూడు తులాల బంగారం, మొబైల్ ఫోన్ తో పాటు రూ.5,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదును వారు ఖర్చు చేసినట్లు విచారణలో తేలింది. ఈ నిందితులను రిమాండ్ కు తరలించగా, వేణు తల్లి సరోజన పరారీలో ఉన్నదని తెలుస్తోంది. ఈ కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించిన ఇంతజార్గంజ్ ఇన్స్పెక్టర్ ఎంఏ షుకూర్, ఎస్సై టి తేజ, కానిస్టేబుల్స్ దీపక్, సురేష్ , ఐటీ కోర్ సల్మాన్ లను ఏఎస్పీ శుభమ్ ప్రకాష్ అభినందించారు.



## ర్యాంపు పరిశుభ్రంగా
# ఉండేలా చూడాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**హన్మకొండ మహా;** ట్రాన్స్ ఫర్ స్టేషన్ లో ర్యాంపు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లోని బాల సముద్రంలో గల సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త తరలింపు వాహన మరమ్మత్తుల్లో జాప్యం ఉండకూడదని ఎప్పటికప్పుడు వెహికల్స్ కు రిపేర్లను పూర్తి చేసి చెత్త తరలింపునకు ఆటంకం లేకుండా చూడాలని,స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తడి పొడి చెత్తను కలిపి తీసుకు రాకూడదని ప్రత్యేకం గా తడి చెత్తను, మరో బిన్ లో ప్రమాదకర చెత్త (హజార్డస్) ను తీసుకురావాలని,ర్యాంపు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఈ ఈ లు రవి కుమార్, మహేందర్, తో పాటు డి ఈ సంతోష్ కుమార్ సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ ఏ ఈ ఫణి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న
## ఏపీ డిప్యూటీ సీఎం సతీమణి

**వరంగల్ మహా;** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజ్నెవా సందర్శించారు. మొదట ఆలయానికి విచ్చేసిన ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి కి ఆలయ ధర్మకర్తలు తొను పునూరి వీరన్న ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో ముఖ్య అర్చకులు చెప్పెల వెంకట నాగరాజ శర్మ, వేదపండితులు ప్రదీప్ కుమార్ శర్మ లు మహా దాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ యాక్షన్ పాన్ ను పక్కాగా అమలు చేయండి

- **వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి**
- **నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** రాబోయే వేసవి కాలం లో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్, గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగం గా ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వేసవిలో బల్దియా పరిధిలోని 66 డివిజన్ లలో మంచినీరు సరఫరాకు రూపొందించిన కార్యచరణ ప్రణాళికలపై సమీక్షించి పక్కా గా నిర్వహించుటకు మేయర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి కాలంలో బల్దియా పరిధిలోని దాదాపు 11 లక్షల మంది జనాభా కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బల్దియా ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్,మిషన్ భగీరథ విభాగాలు పరస్పరం సమన్వయం తో పనిచేయాలని ఇందుకోసం ప్రణాళిక లు రూపొందించుకొని అమలు చేయాలని అన్నారు. నీటి సరఫరా లో సమయపాలన పాటించాలని, లీకేజీ లను అరికట్టి నీటి సరఫరా లో అంతరాయాలు లేకుండా చూడాలని తెలిపారు. రాబోవు నాలుగు మాసాలకు సరిపోయే విధంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో సరిపడా నీటి నిల్వలు అందుబాటు లో ఉన్నాయని అన్నారు. అనివార్య కారణాల వల్ల నగరం లోని ఏదైనా ప్రాంతాలలో నీటి సరఫరా లో



ఆటంకాలు ఏర్పడితే మీడియా ద్వారా సంబంధిత ప్రాంత ప్రజలకు తెలియజేసి ప్రత్యామ్నాయం గా వాటర్ ట్యాంకర్ ల ద్వారా నీటిని అందించాలని, అధికారులకు సూచించారు.నగర వ్యాప్తం గా ఉన్న 66 డివిజన్ లలో ఉన్న స్లం ప్రాంతాల పై దృష్టి సారించి అవసరం మేరకు ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా చేయాలని, బోర్లను ఫ్లషింగ్ చేయడంతో పాటు నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రేటర్ వరంగల్ నగర వ్యాప్తంగా గత వేసవి కాలంలో మాదిరిగా ప్రధాన కూడళ్ళు, జనావాస ప్రాంతాల్లో ప్రణాళిక ప్రకారం చలివేంద్రాలు ఏర్పాటు చేసి చలివేంద్రాలను సక్రమం గా నిర్వహించడానికి వ్యక్తిని నియమించాలన్నారు.నగర పరిధిలో ఉన్న దేశాయిపేట ప్రతాపరుద్ర, కే యు, చిన్న వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ లలో అవసరం మేరకు యుద్ధ ప్రతిపాదికన మరమత్తు లు చేపట్టి అందుకు అవసరమైన రసాయనాలు అందుబాటులో ఉండేలా చూస్తూ శుద్ధమైన మంచినీరు అందిస్తూ, నీటి సరఫరా లో జాప్యాన్ని నివారించాలన్నారుఈ సమీక్ష సమావేశం లో బల్దియా ఇంచార్జి ఎస్ ఈ పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ శ్రీనివాస్ రావు, ఈ ఈలు మహేందర్, రవికుమార్, సంతోష్ బాబు, మాధవి లత, బల్దియా, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ డి ఈ లు, ఏఈ లు పాల్గొన్నారు.

## పరకాలలో బిజెపి ఇంటింటి ప్రచారానికి ఆశేష ప్రజాస్పందన

**బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా పగడాల కాళీ ప్రసాద్ రావు**

**మహా పరకాల:** మున్సిపల్ ఎలక్షన్ ప్రచార కార్యక్రమం లో భాగంగా 16వ వార్డ్ అభ్యర్థి సదా మధుకర్ 22వ వార్డ్ అభ్యర్థి కొలనుపక భద్రయ్య 20వ వార్డ్ అభ్యర్థి దుబాసి లావణ్య కృష్ణ ప్రసాద్ వార్డ్ అభ్యర్థి పాలకుర్తి తిరుపతి గెలుపే లక్ష్యంగా ఇంటింటా ప్రచార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి పరకాల మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరింగి సంతోష్ కుమార్ తో కలిసి పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ బిజెపి పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు తమ ఓటు వేసి గెలిపించి తీరుతారని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



కాచం గురు ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులు దేవునూరి మేఘనాథ్ సంద్ర మధు జిల్లా ట్రెజరీ ఎర్రం రామన్న పరకాల పట్టణ కార్యదర్శి సంఘ పురుషోత్తం మండల అధ్యక్షులు కొంగర రవి దామెరుపుల చంద్రమౌళి ఎరుకల దివాకర్ నడి కూడ మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధీర్ జిల్లా మహిళా మోర్చా నాయకురాలు రత్నలక్ష్మి ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు పిట్టల రమేష్ సీనియర్ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## సఖి భవన నిర్మాణం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వన్ స్టాప్ సఖి భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ నిర్మాణంలో ఉన్న సఖి భవనాన్ని పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణానికి అవసరమైన అదనపు నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.సఖి భవనానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెంటనే డిమార్కేషన్ చేయాలని స్థానిక తహశీల్దార్ శ్రీకాంత్ కు ఆదేశాలు జారీ చేశారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు సమగ్ర సేవలు అందే విధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, తహశీల్దార్ శ్రీకాంత్, సఖి కేంద్ర నిర్వాహకులు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు


**రెండవ రోజు 130 మంది గైర్హాజరు**

**వరంగల్ మహా;** ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు రెండు పూటలా నిర్వహించబడ్డాయి. ఉదయం 9 గం నుండి 12 గం వరకు, మధ్యాహ్నం 2 నుండి 5 గం.ల వరకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించబడ్డాయి. సీసీ కెమెరా నిఘాలో బోర్డు నిబంధనల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం జనరల్ మొత్తం 802 విద్యార్థులకు గాను 787 హాజరు కాగా 15 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ మొత్తం 509 విద్యార్థులకు గాను 450 హాజరు కాగా 59 గైర్హాజరయ్యారు.మధ్యాహ్నం 709 జనరల్ మొత్తం విద్యార్థులకు గాను 697 హాజరు కాగా 12 గైర్హాజరయ్యారని ఒకేషనల్ మొత్తం 570 విద్యార్థులకు గాను 526 హాజరు కాగా 44 గైర్హాజరయ్యారని డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. ఈ పరీక్షలను డీఈసీ సభ్యులు మాధవరావు, విజయ నిర్మల, ఫ్లయింగ్ స్క్వాడ్ బృదం ఖయ్యూమ్, కొమురా రెడ్డి తదితరులు పర్యవేక్షించి ఇంటర్ బోర్డుకు సంబంధిత రిపోర్టులు పంపించారు.

## విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ మహా;** పదో తరగతి విద్యార్థులు విద్యలో మరింత మెరుగ్గా ఉండే విధంగా ఉన్నత విద్యా ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి, నారాయణగిరి లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లక్ పల్లి లోని ఉన్నత పాఠశాలలోని పదో తరగతిని కలెక్టర్ సందర్శించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధన గురించి కలెక్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రతను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్ట్ ల గురించి ఆరా తీశారు. పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాల పై ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిని కలెక్టర్ అడిగారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అక్కడే ఉన్న డీఈవో ఎల్ వి గిరిరాజ్ గౌడ్ ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతులను నిర్వహిస్తున్న తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు.



విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు మెనూ ఏంటి, ఏం వండారు, ఎంతమంది విద్యార్థులకు వంట చేశారు అని మధ్యాహ్న భోజనం వండిన నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. అదేవిధంగా ఇదే మండలంలోని నారాయణగిరి లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు, బాలుర సెక్షన్లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. బాలికల తరగతిలో నేచురల్ రిసోర్సెస్ (సహజ వనరులు) అనే పాఠ్యాంశ బోధన సాగుతుండగా విద్యార్థినులను పాఠ్యాంశానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చేత పాఠ్యాంశాన్ని చదివించారు. విద్యార్థినులకు అప్పటికప్పుడే నేచురల్ రిసోర్సెస్ ఏంటి అనే ప్రశ్నకు జవాబులు రాయాలని చెప్పగా విద్యార్థినిలు సమాధానాలు రాశారు. విద్యార్థినులు రాసిన సమాధానాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పదో తరగతి బాలుర సెక్షన్ ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

## పరకాలలో కాంగ్రెస్–బీజేపీలకు షాక్..

**12,14 వార్డుల్లో బీఆర్ఎస్ లో చేరికలు..**

**మహా పరకాల:** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పరకాల పట్టణంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలను వీడుతూ 12వ, 14వ వార్డులకు చెందిన కీలక నాయకులు మంగళవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్‌లో చేరిన వారిలోమాజీ కో-ఆప్షన్ ఎండి ఖాజా, ఎండి అబ్రార్, ఏరుకొండ అవినాష్, బాలాజీ బ్రహ్మం, కనుగుల నరేష్, బోయిని గణేష్, దంచనాల హరీష్, బండి అభిలాష్, దంచనాల శ్రీకాంత్, బండ అరవింద్ (కన్ని) తో పాటు



పలువురు ప్రముఖ నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గండ్రవాడలో గులాబీ జెండా ప్రచారం జోరు

**14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తికి ఉత్సాహభరిత స్పందన**

**మహా పరకాల:** పట్టణంలోని 14వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తి రాకేష్ రావు ప్రచారం జోరుగా కొనసాగుతోంది. మంగళవారం గండ్రవాడ, అయ్యగార్లవాడ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఓటర్లను కలిశారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ప్రజల దృష్టికి తీసుకొచ్చిన దీప్తి, తమకు



అవకాశం ఇస్తే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గండ్రవాడలో ప్రచారం సాగుతున్నంతసేపు "బిఆర్ఎస్ పార్టీ మనది.. మనమే మనకు ఓటేస్తున్నాం" అంటూ ఓటర్లు ఉత్సాహంగా స్పందించడం విశేషంగా మారింది.అలాగే బ్రాహ్మణవాడలో పర్యటించిన సమయంలో అయ్యగార్లు "బిడ్డా.. మా ఓటు నీకే" అంటూ ఆశీర్వదించడంతో ప్రచారానికి మరింత ఉత్సాహం వచ్చింది. మొత్తం మీద 14వ వార్డులో బిఆర్ఎస్ గులాబీ జెండా గట్టిగా ఎగురుతూ, పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. ఈ ప్రచారంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాడి భగవాన్ రెడ్డి, బండి వెంకటేష్ లు పాల్గొన్నారు

# అబద్ధాల పునాదులపై రాజకీయాలు చేయద్దు

**మాజీ ఎమ్మెల్యేకు, బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు.. అభ్యర్థులకు బీ-ఫామ్ లు అందజేసిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట టౌన్ లోని మున్సిపల్ ఎన్నికల కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 12 మంది వార్డు సభ్యులను ప్రకటించి, అభ్యర్థులకు బీఫామ్ లు అందజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయూబ్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పార్టీలు మారుతూ అబద్ధాల పునాదుల పై రాజకీయాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కు వర్ధన్నపేట ప్రజలే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతును చూసి ప్రత్యర్థులు ఓర్వలేక అసత్యాలు, అవాస్తవాలు, దుష్ప్రచారాల తో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పై పరోక్షంగా విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క రూపాయి అభివృద్ధి చేయని నాయకులు, ఇప్పుడు "రెండేళ్లలో తట్టెడు మట్టి కూడా పోయలేదని మాట్లాడటం ప్రజల్ని అవమానించినట్టేనని అన్నారు. కళ్లు లేని కబోధిలా మాట్లాడడం మానుకుని ఒక్కసారి వర్ధన్నపేట లో అడుగు పెట్టి అభివృద్ధి చూడాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల లోనే మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేదలకు 143 ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 100 పడకల ఆసుపత్రి, మినీ స్టేడియం, మున్సిఫ్ కోర్టు, సబ్ జైలు, బంజారా భవన్ వంటి అభివృద్ధి పనులు మంజూరు చేయించామని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయం మేరకే వర్ధన్నపేట పట్టణంలోనే 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని తెలిపారు. వర్ధన్నపేట చెరువు కింద ఉన్న రైతులు, పట్టణ ప్రజలు ఈ తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 12 మంది అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, వర్ధన్నపేట అభివృద్ధికి బహుమతిగా ఇవ్వాలని పట్టణ ప్రజలను కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పై నమ్మకంతో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన సుమారు 50 మంది నాయకులు, కార్యకర్తలను జిల్లా అధ్యక్షులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా



ఆహ్వానించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర రావు, అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మైనారిటీ నాయకులు మహమ్మద్ చోటే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

# బ్లడీ రోమియోలో పూజాహెగ్డే?

దాదాపు నాలుగేళ్లుగా తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంది మంగళూరు సోయగం పూజాహెగ్డే. బాలీవుడ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ అవకాశాలు తగ్గిపోయాయి. అయితే వరుస ఫెయిల్యూర్స్ దృష్ట్యా ప్రస్తుతం ఈ భామ తెలుగు ఇండస్ట్రీపై దృష్టిపెడుతున్నది. ఇటీవలే దుల్కర్ సల్మాన్ నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఆమెను కథానాయికగా ఖరారు చేశారు. 'డీక్యూ 41' వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. సుజీత్ దర్శకత్వంలో నాని 'బ్లడీ రోమియో' అనే చిత్రంలో నటించబోతున్నారు. వేసవిలో ఈ సినిమా సెట్స్‌మీదకెళ్లనుంది. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇందులో పూజాహెగ్డేను కథానాయికగా ఖరారు చేశారని సమాచారం. త్వరలో అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. దళపతి విజయ్ సరసన పూజాహెగ్డే కథానాయికగా నటించిన 'జన నాయగన్' త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.





# ఐదు భాషల్లో పల్లి చట్టంబి

'2018' మూవీ ఫేమ్ టొవినో థామస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పల్లి చట్టంబి'. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 9న తెలుగు, మలయాళ, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. కాగా మంగళవారం కయాదు లోహర్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. "1950, 1960 దశకాల నేపథ్యంలో సాగే పీరియాడిక్ మూవీ 'పల్లి చట్టంబి'. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ మూవీలో ఇప్పటివరకూ చూడని సరికొత్త పాత్రలో టొవినో థామస్ కనిపించనున్నారు. 'డ్రాగన్' మూవీ సక్సెస్ తర్వాత కయాదు లోహర్‌కి ప్రేక్షకుల్లో పెరిగిన క్రేజ్ మా సినిమాకి ప్లస్ కానుంది. ఇటీవలే ఐదు భాషల్లో రిలీజ్ చేసిన 'పల్లి చట్టంబి' మోషన్ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్నాయి'' అని మేకర్స్ తెలిపారు. విజయ రాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెగ్జాండర్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: టిజో టోమీ, సంగీతం: జేక్స్ బిజోయ్, అసోసియేట్ ప్రొడ్యూసర్స్: మేఘ శ్యామ్, తంజీర్.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034